సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 5 । మే । 2025



సేదతీరిన శ్రీవారి భక్తులు

ద్వారకాతిరుమల: ఉష్ణతాపంతో అల్లాడుతున్న శ్రీవారి భక్తులు ఆదివారం కురిసిన వర్షంతో సేదతీరారు. అనివేటి మండపం, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద అధిక సమయం గడిపారు.



బీచ్‌లో యువకుడి గల్లంతు

అబ్బిరాజుపాలేనికి చెందిన పవన్‌కుమార్ అనే యువకుడు పేరుపాలెంలో సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు.

8లో



నేల రాలిన మామిడి

ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో కోత కొచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

8లో

న్యూస్‌రీల్

వర్షం ధాటికి కూలిన ఇంటి శ్లాబు



ఇంటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: అకాల వర్షానికి ఇంటి శ్లాబు కూలిపోయిన ఘటన మండలంలోని వేల్పూరులో చోటు చేసుకుంది. గ్రామంలోని చింతలదొడ్డిలో ఆదివారం ఉదయం వర్షం వస్తున్న సమయంలో అకస్మాత్తుగా రెండు పోర్షన్ల డాబా ముందు భాగం శ్లాబు కూలిపోవడంతో సన్‌సైడ్, మెట్ల ల్యాండింగ్ నేలకొరిగాయి. ఒక పోర్షన్‌లో నివసించే తాళ్ల స్వామి కుటుంబం ఊరు వెళ్లగా, మరో పోర్షన్‌లో ఉండే తాళ్ల కోటమ్మ పక్కింటికి వెళ్లింది. దీంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. శ్లాబుతో పాటు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. రెవెన్యూ అధికారులు వచ్చి వివరాలు సేకరించారు. ఇంటిని సీపీఎం గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు, శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, నాయకులు తాడిశెట్టి కోటివెంకటేశ్వరరావు, గణేష్, తిప్పా శివ పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులు రోజువారీ కూలీ చేసుకుని జీవించే పేదలని, వారికి న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్ అధికారులకు పదోన్నతులు, బదిలీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్‌లో పలువురు అధికారులకు పదోన్నతులు, బదిలీలు చేస్తూ సంస్థ సీఎండీ పృధ్వీతేజ్ ఇమ్మడి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరులో టెక్నికల్/ఎంఆర్‌టీ విభాగంలో ఏఈఈగా పనిచేస్తున్న ఎస్.ఉషారాణికి డిప్యూటీ ఈఈగా పదోన్నతి కల్పించి ఆమెను ఏలూరులోనే ఎల్‌టీఎం అండ్ ఎస్‌పీఎం విభాగానికి బదిలీ చేశారు. ఏలూరు ఎల్‌టీఎం అండ్ ఎస్‌పీఎం విభాగంలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న కె.రమేష్‌ను జీలుగుమిల్లి ఆపరేషన్ డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. జీలుగుమిల్లి ఆపరేషన్ డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎస్.పద్మినిని అనకాపల్లి ప్రొటెక్షన్ విభాగానికి బదిలీ చేశారు.

నేడు పీజీఆర్ఎస్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లో కూడా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పాఠ్య పుస్తకాల సరఫరా



పుస్తకాల సరఫరాను పరిశీలిస్తున్న డీఈఓ నారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 48 మండల కేంద్రాలకుగాను 41 మండలాలకు ఫస్ట్ స్పెల్ పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగినట్టు తాడేపల్లిగూడెం జిల్లా పాఠ్య పుస్తక విక్రయ కార్యాలయం మేనేజర్ భాస్కరరావు తెలిపారు. మొదటి సెమిస్టర్‌కు 12,44,861 పుస్తకాలు అవసరం కాగా 9,31,957 పుస్తకాలు వచ్చాయన్నారు. వీటిలో ఇప్పటివరకు 6,44,126 పుస్తకాలను ఆయా మండలాలకు తరలించామన్నారు. రెండో రోజుల్లో ఏలూరు, లింగపాలెం, కుక్కునూరు, ఏలూరుపాడు, నిడదవోలు, దెందులూరు, భీమడోలు మండలాలకు పుస్తకాలు సరఫరా చేస్తామన్నారు. 9, 10 తరగతుల హిందీ సిలబస్ మారడంతో కొత్త పుస్తకాలు వచ్చాయన్నారు. డీఈఓ నారాయణ ఆదివారం పాఠ్య పుస్తక విక్రయ కార్యాలయాన్ని పరిశీలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

ఆగిరిపల్లి : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు, చోరీలను అరికట్టవచ్చని డీఎస్పీ కేవీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వ్యాపారస్తులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. వ్యాపారులు తమ దుకాణాల ముందు తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల ముందు వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఎస్సై శుభశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భీమవరం : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కూలిన చెట్టు



భీమవరం : నర్సయ్య అగ్రహారంలో ఆటోపై కూలిన చెట్టు



పెనుగొండ : ఇలపర్రులో తడిసిన ధాన్యం బస్తాలతో రైతు

అకాల కష్టం.. అపార నష్టం



అత్తిలి : తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు పాట్లు



భీమవరం : చిధ్రమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జడిపించిన వాన

- జిల్లాలో గాలివాన బీభత్సం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- 60 వేల ఎకరాల్లో పంట చేలల్లోనే..
- రైతుల వద్దే 5.50 లక్షల టన్నుల ధాన్యం



యలమంచిలి : గుంపర్రులో బరకాలపై నీటిని తొలగిస్తున్న మహిళలు

భీమవరం: జిల్లాలో ఆదివారం వర్షం బీభత్సం సృష్టించింది. ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమై భారీ వర్షం కురిసింది. పిడుగులు, ఉరుములతో భయపెట్టడంతో కళ్లాల్లోని పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. పలుచోట్ల చేలల్లోనే ధాన్యం రాశులు ఉండటంతో బరకాలు కప్పినా బస్తాలు తడిచిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు వాహన రాకపోకలు స్తంభించాయి.

60 వేల ఎకరాల్లో పంట చేలలోనే..

జిల్లాలో దాళ్వా సీజన్‌లో దాదాపు 2.20 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయగా ఇప్పటివరకు సుమారు 1.60 లక్షల ఎకరాల్లో పంట మాసూళ్లు చేశారు. జిల్లావ్యాప్తంగా 9.20 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుదని అధికారులు అంచనా వేయగా వాతావరణం అనుకూలించడంతో ధాన్యం దిగుబడి 10 లక్షల టన్నులకు పైగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం 6 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇవ్వడంతో ఇప్పటివరకు కేవలం సుమారు 4.40 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. దీనితో ఇంకా దాదాపు 5.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్దనే ఉంది. సంచులు లేకపోవడం, తేమ శాతం పేరుతో మిల్లర్లు ధాన్యం సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం కళ్లాలోనే మిగిలిపోయి భారీ వర్షానికి తడిచి రైతులు నష్టపోతున్నారు. ధాన్యం పట్టుబడికి మరో 30 లక్షల సంచులు సరఫరా చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించినా ఇప్పటికీ స్పందన లేదు.

పంట కోసం పాట్లు

ధాన్యం పట్టుబడులు లేకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే కళ్లాలు, రోడ్లు వెంబడి రాశులు చేసి రైతులు బరకాలు కప్పి కాపాడుకుంటున్నారు. పల్లపు ప్రాంతాల్లోని ధాన్యాన్ని గట్టుకు తెచ్చుకోవడం, మైకా బరకాలు కప్పి తడవకుండా కాపాడుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. దిగుబడులు బాగున్నా పంటను అమ్ముకోలేకపోతున్నామనే ఆవేదనలో రైతులు ఉన్నారు.



యలమంచిలి : పాలకొల్లులో ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన కొబ్బరి చెట్టు



అత్తిలి: నేలకొరిగిన వరి చేను



పెంటపాడు: అలంపురంలో ధాన్యం బస్తాలపై బరకాలు కప్పుతున్న రైతులు

ఏకాధాటిగా.. కుండపోతగా..



నరసాపురం : జలమయమైన రోడ్డు

ఆకాశం మేఘావృతమే ఉదయం 8 గంటల సమయంలో ఏకధాటిగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులు, భీకర గాలులతో కుండపోత వర్షం పడింది. పలు ప్రాంతాల్లో దాదాపు 3 గంటలకు పైగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. భీమవరంలోని నర్సయ్య అగ్రహారంలో చెట్టుకూలడంతో ఆటో ధ్వంసమైంది. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగిపొర్లాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, తీగలపై చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ స్తంభాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది.

ధాన్యం దళారుల పాలయ్యేలా ఉంది



దువ్వలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, చిత్రంలో రైతులు

దువ్వలో తడిసిన ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడిన కారుమూరి

తణుకు అర్బన్: గోనె సంచులు లేక రైతులు ధాన్యాన్ని రోడ్లపైనే ఉంచాల్సిన పరిస్థితి దాపురించిందని, ధాన్యం దళారుల పాలయ్యేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. మండలంలోని దువ్వ గ్రామంలో ఆదివారం జాతీయ రహదారి పక్కనే ఉన్న ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనాల్సిందేనని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే రైతులకు మద్దతుగా రోడ్డెక్కేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రానికి తోలుదామంటే ప్రభుత్వం గోనె సంచులు అందించలేదన్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని రాశులుగా పోసి టార్పాలిన్‌లతో కప్పాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ధాన్యం కొనలేమని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పడం రైతుల దౌర్భాగ్యమని కారుమూరి విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతులను ఉద్ధరిస్తామని ఎన్నికల ముందు నానా హంగామా చేసిన కూటమి ప్రభుత్వం, నేడు ధాన్యం కొనుగోలు చేయడం లేదని, గోనె సంచులు ఇవ్వకపోవడమేమిటని నిలదీశారు. ఇప్పటికే దళారులు ప్రవేశించి భారీగా ధర తగ్గించి కొనుగోలు చేసే కుట్ర జరుగుతోందన్నారు. ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే గాని, వ్యవసాయ శాఖాధికారులు గాని స్పందించకపోవడం శోచనీయమన్నారు.

ధాన్యం మొత్తం కొనాల్సిందే

ధర్నాలకు దిగిన అన్నదాతలు



ఉంగుటూరు : బొమ్మిడిలో సొసైటీ వద్ద రైతుల ఆందోళన

ఉంగుటూరు: ధాన్యం మొత్తం కొనుగోలు చేయండి.. లారీల్లో లోడు చేసిన ధాన్యం మిల్లులకు పంపండి.. ధాన్యం కొనుగోలు లక్ష్యాలు పెంచండి.. గోనె సంచులు ఇవ్వండి అంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బొమ్మిడి సొసైటీ వద్ద ఆదివారం రైతులు, కౌలు రైతులు ఆదివారం ధర్నాకు దిగారు. లారీల్లో లోడు చేసిన ధాన్యం మూడు రోజులుగా మిల్లులకు తరలించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లారీల వద్ద బైఠాయించారు. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ టార్గెట్‌ల పేరుతో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడం అన్యాయమన్నారు. ఏలూరు జిల్లాలో 4 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 2.20 లక్షల టన్నుల ఉమాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అనడం దారుణమన్నారు. ప్రతి గింజా కొంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బొమ్మిడిలో నిలిచిపోయిన 10 లారీల ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరారు. మండల నాయకులు దూడే కేశవ, వానపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఊడిమూడి దానియేలు, మరుకుర్తి ధనంజయరావు, లంక వెంకటేశ్వరరావు, నక్కా సత్యనారాయణ, సాధనాలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో గళమెత్తి..

దెందులూరు: ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ధర్నాకు దిగారు. ముందుగా బరకాలు కప్పి ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, బరకాలపై పడిన వర్షం నీళ్లను తోడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క మల్కాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో 1,500 టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉండిపోయిందన్నారు. ధాన్యం కొనలేం.. అంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణమని విమర్శించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నిబంధనలు సడలించాలని కోరారు. మల్కాపురం పరిధిలో 700 టన్నుల కొనుగోలుకు టార్గెట్ ఇచ్చినట్టు రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ చెప్పడంతో రైతులు ధర్నాను విరమించారు. రైతులు ఆదాడ శ్రీనివాసరావు, లంకా వెంకటరమణ, గొర్రెల రొయ్యా రావు, గుర్రాల శోభన్‌బాబు, కండిబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దెందులూరు : మల్కాపురంలో రైతు సేవా కేంద్రం వద్ద నిరసన

తడిసిన ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

పెనుగొండ: అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కురిసిన వర్షం కారణంగా తడిసిన ధాన్యం రాశులను, బస్తాలను ఆచంట, పెనుగొండ మండలం ములపర్రులో ఆయన పర్యటించి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని వేరే రైసు మిల్లులకు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అలాగే గోనె సంచులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సంబంధిత అధికారులు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ కనకరాజు, ఏఓలు పి.స్పందన, బి.నాగరాజు, వీఆర్వో సీతారామ్, కోట వెంకటేశ్వరరావు ఆయన వెంట ఉన్నారు.



ములపర్రులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ

నీట్ పరీక్షలకు 97.5 శాతం హాజరు

తాడేపల్లిగూడెం : జిల్లాలో నీట్-యూజీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. తాడేపల్లిగూడెంలోని రెండు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సీహెచ్ నాగరాణి తనిఖీ చేశారు. 97.5 శాతం విద్యార్థులు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఏపీ నిట్ కేంద్రంలో 1,128 మందికి 1,108 మంది, శశి ఇంజనీరింగ్ కళాశాలలో 758 మందికి 739 మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పర్యవేక్షించారు. కలెక్టర్ వెంట డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓ కతీబ్ ఖౌసర్ భానో, పరీక్షల కో-ఆర్డినేటర్ ఎన్.జయరామ్ ఉన్నారు.



తాడేపల్లిగూడెంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఏలూరులో ప్రశాంతంగా..

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కేంద్రాల్లోకి విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కేంద్రాల్లోకి పంపించారు. మొత్తం 1,200 మంది విద్యార్థులకు 1,162 మంది హాజరయ్యారు. ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 240 మందికి 232 మంది, కస్తూరిబా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 360 మందికి 347 మంది, ఆర్ఆర్‌పేట సుబ్బమ్మదేవి హైస్కూల్ కేంద్రంలో 240 మందికి 234 మంది, గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయ కేంద్రంలో 240 మందికి 235 మంది, గోపన్నపాలెం హైస్కూల్ కేంద్రంలో 120 మందికి 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫిజిక్స్ ప్రశ్నలు క్లిష్టంగా, బయోలజీ సులువుగా, కెమిస్ట్రీ ప్రశ్నలు మోస్తరుగా ఉన్నట్టు విద్యార్థులు అన్నారు.

క్లుప్తంగా

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.48,000, లడ్డూ ప్రసాదంపై రూ 23,250 ఆదాయం లభించిందని ఈవో చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ


కొల్లేటికోట దేవస్థానం వద్ద భక్తుల రద్దీ

కైకలూరు: సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కొల్లేటికోట పెద్దింట్లమ్మను అమ్మను ఆదివారం దర్శించుకున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజు ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూల అమ్మకం, గదుల అద్దెలు, అమ్మవారి ఫొటోల ద్వారా మొత్తం రూ.61,105 ఆదాయం వచ్చిందని తెలిపారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 8 గంటల సమయంలో భారీ వర్షం కురవడంతో మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు.

యోగా చాంపియన్‌కు సత్కారం


శిరీషను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రెండో ఆసియా యోగాసన చాంపియన్‌షిప్ పోటీలలో ఇటీవల బంగారు పతకం సాధించిన భీమవరానికి చెందిన బాలం శిరీషను ఆదివారం తాడేపల్లిగూడెం శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నేషనల్ యోగాసన కోచ్ కరిబండి రామకృష్ణ, యోగా సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలం శిరీష కఠోరమైన దీక్షతో బంగారు పతకం సాధించడం పలువురికి ఆదర్శప్రాయం అన్నారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామాంజనేయులు, గ్రంధి ప్రసాద్, యోగా సభ్యులు, మహిళా సభ్యులు తదితరులు శిరీషను శాలువలతో సత్కరించారు.

గాలివాన బీభత్సం


ఆకివీడు: మండలంలో భారీ ఈదురుగాలులు

ఆదివారం ఉదయం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒక్కసారిగా వాతావరణం మారి.. పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాణిజ్య, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లగా.. పలు చోట్ల ధాన్యం నీట తడిసింది. రహదారులకు అడ్డంగా చెట్ల కొమ్మలు విరిగిపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. –సాక్షి నెట్‌వర్క్


అత్తిలి: మండలంలోని బల్లిపాడులో ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం


ఆకివీడు: జాతీయ రహదారి నీట మునిగిన దృశ్యం


బుట్టాయగూడెం: లంకపాకలలో ఒరిగిన స్తంభం


కైకలూరు: రైతు బజారు భారీ వృక్షాన్ని తొలగిస్తున్న రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది


నరసాపురం రూరల్: కొప్పర్రు-మల్లవరం రహదారిలో కూలిన చెట్లు


పాలకొల్లు: ఎర్రవంతెన వద్ద రోడ్డుపై కూలిన చెట్టు


పాలకోడేరు: విస్సాకోడేరులో జాతీయ రహదారిపై కూలిన వృక్షం

శ్రీవారి క్షేత్రంపై గాలివాన ఎఫెక్ట్


శ్రీవారి ఆలయ ఆవరణలో పాక్షికంగా ధ్వంసమైన వైకుంఠం క్యూ కాంప్లెక్స్

ద్వారకాతిరుమల: ఒక్కసారిగా విరుచుకుపడ్డ ఈదురు గాలులు, భారీ వర్షం కారణంగా శ్రీవారి ఆలయ ఆవరణలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ పాక్షికంగా దెబ్బతింది. ద్వారకాతిరుమల–భీమడోలు ప్రధాన రహదారిలో పలు చోట్ల వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో, గొల్లగూడెం, పంగిడిగూడెం వద్ద రోడ్డుపై నీరు నిలిచింది. వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. ద్వారకాతిరుమలలో వర్షం దాటికి డ్రైనేజీలు పొంగిపొర్లడంతో మురుగు, చెత్తా, చెదారం రోడ్డుపైకి చేరింది. దాంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సొసైటీ పెట్రోల్ బంకు ఎదురుగా, లక్ష్మీపురం నిర్మిత కేంద్రం, దొరసానిపాడు శివారులో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దాంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మార్కెట్ యార్డులో కూరగాయల దుకాణాలు గాలులకు అతలాకుతలమయ్యాయి.

నేలరాలిన మామిడి

ఈదురు గాలుల భీభత్సం

ద్వారకాతిరుమల: మండలంలో ఆదివారం ఉదయం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దాంతో పలు గ్రామాల్లోని మామిడి తోటలు అతలాకుతలమయ్యాయి. కోతకొచ్చిన మామిడి కాయలు నేలరాలడంతో రైతన్నలు లబోదిబో మంటున్నారు. అందులో భాగంగా సత్తెన్నగూడెంలోని తోటల్లో పెద్ద ఎత్తున మామిడి కాయలు రాలిపోయాయి. వర్షం వెలిసిన తరువాత రైతులు తోటల్లోకి చేరుకుని నేలరాలిన కాయలను ఒక చోటకు చేర్చారు. పి.కన్నాపురం, చుట్టుపక్కల గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిచిముద్దైంది. దాంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

చింతలపూడి మండలంలో..

చింతలపూడి: ఈదురు గాలులు చింతలపూడి మండలంలో బీభత్సం సృష్టించాయి. ఉరుములు, పిడుగులతో కురిసిన భారీ వర్షానికి మామిడి రైతులు నష్టపోయారు. కాయ మంచి సైజుకు చేరుకుంటున్న తరుణంలో గాలుల కారణంగా మామిడి కాయలు నేల రాలాయి. బొప్పాయి, అరటి, కోకో , మొక్కజొన్న పంటలకు కూడ పాక్షికంగా నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురం, రాజుగారితోట గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలడంతో రైతులు దిగాలు పడ్డారు. దిగుబడి అంతంత మాత్రంగా ఉండగా.. ఉన్న కొద్దిపాటి కాయలు రాలిపోవడంతో రైతులు వాపోయారు.


చింతలపూడి మండలంలోని శెట్టివారిగూడెంలో రాలిన మామిడి కాయలు


ద్వారకాతిరుమల మండలం సత్తెన్నగూడెంలో నేలరాలిన కాయలు ఏరుతున్న రైతులు


నరసాపురం రూరల్ సీతారాంపురం సౌత్‌లో ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు

కోడికత్తి తగిలి ముగ్గురికి గాయాలు

నూజివీడు: మండలంలోని దేవరగుంటలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి చేసేందుకు పోలీసులు వెళ్లగా కత్తికట్టిన కోడిపుంజులు వదిలి ఒక్కసారిగా అందరూ పరిగెత్తడంతో కోడికత్తులు తగిలి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామంలో ఆదివారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్ల పందేలు ఆపేందుకు సాయంత్రం ఐదు గంటల సమయంలో వెళ్లారు. కోడిపుంజులకు కత్తులు కట్టి పందేం వేసేందుకు బరి లోకి దించుతుండగా పోలీసులు వెళ్లడంతో అక్కడి వాళ్లు పుంజులను వదిలేసి పారిపోతుండగా పుంజులు బెదిరి జనంపైకి పడ్డాయి. దీంతో దేవరగుంటకు చెందిన పల్నాటి ప్రసాద్‌కు మోకాలి వద్ద, నూజివీడు పట్టణంలోని రామాయమ్మరావుపేటకు చెందిన మాళావతు అశోక్‌కు చేతిమీద, కానిస్టేబుల్‌కు కాలుపైన కోడి కత్తి తెగింది. ప్రసాద్‌కు దాదాపు 14కుట్లు పడ్డాయి. అశోక్‌కు నరం తెగడంతో విజయవాడ రిఫర్ చేశారు. అధికార పార్టీ అండ చూసుకొని గ్రామంలో ప్రతిరోజూ కోడిపందేలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కోడిపందేలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


కోడికత్తి తగలడంతో పల్నాటి ప్రసాద్ కాలుకి గాయం

● బొండం కొట్టండి ప్లీజ్!



నాకో కొబ్బరి బొండం కొట్టండి.. అంటూ భక్తులు ట్రాక్టర్ వద్ద ఎగబడ్డారు. చింతలపూడికి చెందిన జల్లిపల్లి రామకృష్ణ, సులోచన దంపతులు వారి పెళ్లిరోజు సందర్భంగా ఆదివారం భక్తుల కోసం 1,600 కొబ్బరి బొండాలు ట్రాక్టర్‌లో తీసుకొచ్చారు. వాటిని ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదిక వద్ద భక్తులకు పంపిణీ చేశారు. కొబ్బరి బొండాలు కొట్టివ్వడం ప్రహసనంగా మారింది. ఈ క్రమంలోనే బొండాలు అందుకున్న భక్తులు నాకో బొండం కొట్టివ్వండి అంటూ ట్రాక్టర్ వద్ద ఎగబడ్డారు.
–ద్వారకాతిరుమల

బాలికకు ఆర్థిక సాయం

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంకు చెందిన కంచర్ల జ్యోత్స్నకు వైద్య చికిత్స నిమిత్తం రూ.30 వేలు ఉడుత స్వచ్ఛంద సంస్థ అందజేసిందని పాప తండ్రి కంచర్ల రాజేష్ ఆదివారం తెలిపారు. సాక్షిలో ఏప్రిల్ 29న ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు శీర్షికకు స్పందించిన హైదరాబాద్‌కు చెందిన ఉడుత స్వచ్ఛంద సంస్థ సహకారం అందించిందన్నారు. సుమారు పన్నెండు లక్షల రూపాయల వరకు వైద్య చికిత్సకు ఖర్చు అవుతుందని వైద్యులు అనడంతో దాతలపై ఆధారపడి ఉన్నామని రాజేష్ తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై దాడి కేసు నమోదు

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి ఆటో డ్రైవర్‌ను కొట్టడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రెహమాన్ ఆదివారం చెప్పారు. పట్టణంలోని రాజులవీధికి చెందిన కాసాని సత్యనారాయణ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. టౌన్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి పట్టణంలోని లాడ్జిలో దిగడానికి ఆటో మాట్లాడుకున్నాడు. మూడు లాడ్జిలు తిరిగిన తరువాత ఆటో దిగిపోవడంతో డబ్బులు అడగగా రూ.150 ఇచ్చాడు. మరో రూ. 50 ఇవ్వాలని సత్యనారాయణ అడగడంతో అతనిపై దాడిచేసి గాయపర్చి వెళ్లిపోయాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రెహమాన్ చెప్పారు.

పేరిచర్లకు లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డు


అవార్డు అందుకుంటున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ అడ్మినిస్ట్రేటర్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు లయన్స్ ఇంటర్నేషనల్ స్పెషల్ అప్రిసియేషన్ అవార్డు అందుకున్నారు. పాలకొల్లులో జరిగిన కార్యక్రమంలో క్లబ్ ఉప గవర్నర్ విజయ్‌కుమార్ రాజు పర్యవేక్షణలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, రాజకుమారిలు అవార్డు అందజేశారు. లయన్స్ క్లబ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని పలువురు కొనియాడారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో మే 20న ఉపాధి పనులు బంద్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

11 కాసుల బంగారం చోరీ

ఉండి: గ్రామంలోని శేషాద్రి మధుసూధనరావు చెందిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఆదివారం తెల్లవారుజామున దోపిడీకి పాల్పడ్డారు. చోరీలో 11 కాసుల బంగారం, రూ.35 వేల నగదు దోచుకుపోయారు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి

ఉంగుటూరు: ఉంగుటూరు–బాదంపూడి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం వేకువ జామున రైలు నుంచి జారి కరోతి గణేష్ (35) మృతిచెందాడు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలం ఊమలాడకు చెందిన గణేష్ తిరుపతి నుంచి తిరిగి వస్తుండగా.. ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయాడు. గుమ్మం వద్ద కూర్చుని ప్రయాణిస్తున్న అతను నిద్రలోకి జారుకుని కిందకు పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన గణేష్‌ను 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

రాయకుదురులో చోరీ

వీరవాసరం: వీరవాసరం మండలం రాయకుదురులో ఆదివారం భారీ చోరీ జరిగింది. రాయకుదురు గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగచంద్రరావు (నాగులు) కుటుంబ సభ్యులు గత నెల 29న బెంగళూరులో ఉంటున్న కుమారుడు వద్దకు వెళ్లారు. ఈ నెల 4న రాయకుదురు వచ్చారు. తిరిగివచ్చి చూసేసరికి గేటు తలుపులు బద్దలు కొట్టి ఉండటంతో అవాక్కయ్యారు. విషయాన్ని పోలీసులకు చెప్పడంతో వారు సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. బీరువాలో దాదాపు 8 కాసుల బంగారం, కేజీ విలువగల వెండి వస్తువులు, రూ.10 వేల నగదు చోరీకి గురయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

మండవల్లి: పిడుగు పడి ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన మండవల్లి మండలం దెయ్యంపాడులో జరిగింది. ఆదివారం ఉదయం భారీ వర్షం సమయంలో గ్రామానికి చెందిన సైదు నాగరాజు కుమారుడు గిరిబాబుపై పిడుగు పడడంతో మృతి చెందాడు.

మహిళ ఆత్మహత్య

ఏలూరు టౌన్: టూటౌన్‌లో ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చాణక్యపురి కాలనీ 2లో ఉంటున్న ముప్పన హనుమంతురావు, పుష్ప దంపతులకు ఇద్దరు పిల్లలు. పుష్ప (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్యం వల్ల జీవితం పై విరక్తి చెంది తీవ్ర మానసిక ఒత్తిడితో ఆదివారం ఇంట్లో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి గల్లంతు


వలవల పవన్‌కుమార్ (ఫైల్)

యలమంచిలి: మండలంలోని అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన వలవల పవన్‌కుమార్ (21) పేరుపాలెం వద్ద సముద్ర స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం భీమవరంలో హాస్టల్‌లో ఉంటూ డీఎన్నార్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో భీమవరం నుంచి ఎనిమిది మంది స్నేహితులు కలసి పేరుపాలెం బీచ్‌కు వెళ్లాడు. తెల్లవారుజామునే సముద్రం వద్దకు వెళ్లి స్నానానికి లోనికి వెళ్లారు. లోపలకు వెళ్లడంతో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. స్థానికులు చూసి తాడు సహాయంతో ఇద్దరిని రక్షించారు. పవన్‌కుమార్ గల్లంతయ్యాడు. పవన్‌కుమార్ గల్లంతుతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వలవల రాముడు, రామ తులసి దంపతులకు ఇద్దరు కుమారులు. ఆస్తి లేకపోయిన ఇద్దరు కుమారులను కష్టపడి ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చాలా బాధాకరమని అబ్బిరాజుపాలెం సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు చెప్పారు.

బెస్ట్ అంపైర్ అవార్డుకు ఎంపిక



ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరానికి చెందిన క్రికెట్ అంపైర్ నాగేంద్ర సింగ్ బెస్ట్ అంపైర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 9న ఆగ్రాలో ఆయన అవార్డును అందుకోనున్నారు. 2019 నుంచి నాగేంద్ర సింగ్ దివ్యాంగుల క్రికెట్ మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరిస్తున్నారు.

జిల్లా పరిషత్‌లో అగ్ని ప్రమాదం

ఏలూరు(మెట్రో): జెడ్పీ కార్యాలయంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అకౌంట్స్ అధికారి గదిలో పాత ఏసీ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే అక్కడ క్రికెట్ ఆడుకునే కొంతమంది సమాచారం తెలియజేయడంతో ఏలూరు ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకున్నారు. అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఆదివారం కావడంతో కార్యాలయానికి ఉద్యోగులు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

క్లుప్తంగా

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చెప్పించి, ఇంగ్లీషు పదాలను పూరించారు. ఉపాధ్యాయుడు ఎస్.దుర్గాప్రసాద్ భగవద్గీత శ్లోకాలు, పెద్ద బాలశిక్షపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, పుస్తక పఠనంతోనే సాధ్యమని రిటైర్డు ఉపాధ్యాయుడు జి.అవతారమూర్తి అన్నారు. గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో కాలయాపన చేయకుండా సమయాన్ని గ్రంథాలయంలో సద్వినియోగం చేసుకుని పుస్తక విజ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు గ్రంథపాలకుడు గంధం శేషవేంద్రరావు, టి.ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, రీడర్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే



ప్రార్థనా కేంద్రం నిర్వాహకులు జమాయమ్మను సన్మానిస్తున్న చర్చి సంఘ సభ్యులు

పెంటపాడు: మదర్స్ డే పురస్కరించుకొని జాయ్‌గుడ్ ఫ్రెండ్స్ అసోషియేషన్ సంస్థ ఆదివారం వల్లూరుపల్లి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిపూడి జాయ్‌బాబు ఆధ్వర్యంలో చర్చి సంఘ సభ్యులు ప్రార్థనా కేంద్రం నిర్వాహకురాలైన మల్లిపూడి జమాయమ్మను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా జాయ్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిని మరువకూడదన్నారు. మాతృమూర్తిని ప్రత్యక్ష దైవంగా భావించి తల్లిదండ్రులను అక్కున చేర్చుకోవాలన్నారు. చర్చి సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవాసవీమాత సన్నిధిలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే



వాసవి అమ్మవారిని దర్శించిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలోని శ్రీవాసవి అమ్మవారిని ఆదివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రాజగోపాల్‌కు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ హోమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం తొలుత కలశ స్థాపన, నవగ్రహ మండపారాధన, లక్ష్మీనారాయణ అష్టత్తర పూజలు, అష్ట దిక్పాలక, నవగ్రహ, పంచపాలక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనారాయణ హోమం వేద పండితులచే వేద మంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంగను భువికి దించిన ఘనుడు భగీరథుడు



మోదుగ గుంట సచివాలయం వద్ద భగీరథుని జయంతి నిర్వహిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: గంగమ్మను తన తపస్సు ద్వారా భువికి దించిన ఘనుడు భగీరథుడు అని సగర సంఘ నాయకుడు ఏపూరి సత్యనారాయణ కొనియాడారు. ఆదివారం మండలంలోని మోదుగ గుంట సచివాలయం వద్ద భగీరథుని జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. నాయకులు కట్టా జానకీరామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఓ ప్రకటన విడుదలచేశారు. డివిజన్‌లోని అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని పేర్కొన్నారు.

చివరిలో గంగపాలు

- ఈదురుగాలులు, భారీ వర్షంతో ఆందోళనలో రైతాంగం
- పంటను కాపాడుకొనేందుకు అన్నదాత అగచాట్లు



అత్తిలి: పొలాలులో ధాన్యం పట్టుబడి పడుతున్న రైతులు



పెంటపాడు: ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

పెంటపాడు: ప్రతికూల వాతావరణానికి దొరకకూడదన్న రైతు ఆశలను ఆవిరి చేసేలా ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షం చివరిలో రైతులను దెబ్బతీసింది. ఇప్పటికే దాళ్వా మాసూళ్లు మెట్ట, డెల్టా ప్రాంతాల్లో 90 శాతం పూర్తయ్యాయి. చాలా వరకు వరి పంట గట్టెక్కింది అనుకుంటున్న తరుణంలో ఒక్కసారిగా ఆదివారం ఉదయం భారీ వర్షం, ఈదురుగాలులు వీచాయి. అయితే ఉన్న 10 శాతం మాసూళ్లు చేసుకొనే రైతులకు వర్షం ఆటకంగా మారింది. మండలంలో పలు గ్రామాల్లో నెట్లుగా వేసుకొన్న ధాన్యం వర్షం ధాటికి తడిచిపోయింది. దీంతో పాటు పశుగ్రాసం 60 శాతం తడిచిపోయి, చేలల్లోకి నాలుగు అంగుళాల మేర నీరు నిలిచిపోయింది. దీంతో రైతులకు ఏం చేయాలో పాలుపోలేదు. ఇదిలా ఉంటే వేగంగా వీచిన గాలి ధాటికి కొండేపాడు, కోరిమిల్లి గ్రామాలలో రోడ్డుకు అడ్డంగా మర్రి, తాడిచెట్లు పడ్డాయి. రైతులు ధాన్యం ఒబ్బిడి చేసుకొనే పనిలో బిజీగా ఉన్నారు. మట్టి రోడ్లలో వాహనాలు నడిచే పరిస్థితి లేదు. అకస్మాత్తుగా వచ్చిన ఈ వర్షం వలన మండల వ్యవసాయాధికారి కె.పార్థసారథి ఈ సందర్భంగా ఆయా గ్రామ వీఏఏలు సహాయక చర్యలు చేపట్టాలని కోరగా వారు రైతులకు బరకాలు అందించి ధాన్యం మరింత తడవకుండా కాపాడారు. యానాలపల్లిలో వర్షం ధాటికి గడ్డి ట్రాక్టర్ మట్టిలో కూరుకుపోయింది.

మామిడి మార్కెట్ కుదేలు

కాగా వర్షందాటికి గూడెంలోని ఆదివారం మార్కెట్ కుదేలయ్యింది. శనివారం అర్ధరాత్రి నుండి గూడెం మార్కెట్‌కు వచ్చిన టన్నుల కొద్ది పచ్చడి మామిడి కాయల వ్యాపారం దెబ్బతింది.దీంతో కొనేవారు లేక మామిడి వ్యాపారులతో పాటు, కూరగాయల హోల్‌సేల్ వ్యాపారుల డీలా పడ్డారు.

నిండా ముంచిన వాన

అత్తిలి: ఆరుగాలం శ్రమించి పంటచేతికందే సమయానికి అకాలవర్షం కురవడంతో రైతులను కలవరపాటుకు గురి చేసింది. ఆదివారం ఉదయం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ఆరుగంటల పాటు ఏకధాటిగా కురిసింది. దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న ఈ తరుణంలో అకాల వర్షం కురవడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు పంట చేల వద్దకు రైతులు పరుగులు తీశారు. తణుకు నియోజకవర్గ పరిధిలో అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో 42,264 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. ఇప్పటి వరకు 37.103 ఎకరాలలో వరికోతలు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 1,00,620 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 68,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసింది. నియోజకవర్గంలో ఇంకా 5,161 ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉండగా అత్తిలి మండలంలో అత్యధికంగా 3 వేల ఎకరాల విస్తీర్ణంలో వరికోతలు పూర్తి కావాల్సి ఉంది.

పంటను కాపాడుకునేందుకు నానా అగచాట్లు

అకాల వర్షం కురవడంతో రైతులు ధాన్యం రాశులు, బస్తాలపై టార్పాలిన్లు, బరకాలు కప్పారు. రహదారులు, పుంత రోడ్ల వెంబడి ధాన్యం రాశులు, నెట్ల వద్ద రైతులు నీరు బయటకు పంపేందుకు నానా అగచాట్లు పడ్డారు. మరో పది రోజులు వాతావరణం అనుకూలిస్తే దాళ్వా పంట ఒబ్బిడి అయ్యేదని, ఇంతలో కురిసిన అకాల వర్షానికి నూర్పిడి పనులకు ఆటంకం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాలలో చేలల్లో ఉన్న ధాన్యాన్ని గట్టు పైకి చేరుస్తున్నారు.

అకాల వర్షంతో రైతుల్లో కలవరం

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షంతో రైతులకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం పది గంటల నుంచి సుమారు గంటపాటు ఏకాధాటిగా వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ధాన్యం ఉండిపోవడంతో రైతులు బరకాల కోసం పరుగులు తీశారు. చెట్లు ఎక్కడిక్కడ కొమ్మలు విరిగి పడిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. రైతులు కోతలు కోసి ధాన్యంలో తేమ శాతం ఉందని అరబెడుతుండగా అనుకోకుండా కురిసిన వర్షంతో రైతులు ఆందోళన చెందారు. ఇరగవరం మండలంలో 13501 ఏకారల్లో వరి సాగు చేయాగా ఇప్పటి వరకు 11900 ఎకారల్లో వరి కోతలు పూర్తి అయ్యాయి. మిగిలిన కోతలు చాలా వరకు పూర్తి కాగా ధాన్యం ఎక్కడిక్కడ కల్లాల్లో నిలిచి ఉండటంతో ఇప్పుడు ఏం చేయాలి దేవుడా అని రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. రైతలను ప్రభుత్వం అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షంతో తడిసిన బస్తాలు



ధాన్యం బస్తాలపై బరకాలు కప్పినా వర్షంతో ఒకవైపు తడిశాయి. ఒక రోజు ఉంటే ధాన్యం మిల్లుకు వెళ్లేది. ఎండ వచ్చిన తరువాత తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే రైతులు దాళ్వా మాసూళ్ల పనులు పూర్తి చేసేవారు.

– కునుకు తాతబ్బాయి, రైతు, అత్తిలి

రైస్ మిల్లులకు తరలించాలి



నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు జాగ్రత్తలు తీసుకుని రైసు మిల్లులకు తరలించాలి. కురిసిన వర్షం వలన చేలల్లో నీరు నిలిచిపోయింది. చేలల్లో ఉన్న ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశానికి తరలించాలి. రైతులకు అవసరమైన సంచులు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. రైతులు అధైర్యపడొద్దు. ఇప్పటి వరకు 60 శాతం మేర మాసూళ్లు పూర్తయ్యాయి.

– టీకే రాజేష్, మండల వ్యవసాయశాఖ అధికారి, అత్తిలి



ఇరగవరం: కల్లాల్లో ఉన్న ధాన్యంపై బరకాలు కప్పిన రైతులు



పెంటపాడు: మిల్లుకు తోలే ధాన్యం నెట్టు తడిచిపోవడంతో పరిశీలిస్తున్న వీఏఏ సుస్మిత



అత్తిలి: అకాల వర్షంతో చేను గట్టుకు చేరిన వరికోత యంత్రం



అత్తిలి మండలం కొమ్మరలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్ కప్పుతున్న దృశ్యం

పుస్తక పఠనంతో మంచి విజ్ఞానం



తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



తణుకు అర్బన్: చిన్నారులతో మ్యాజిక్ షో నిర్వహించిన గోపీ మామ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుస్తక పఠనంతో మంచి విజ్ఞానం సొంతం అవుతుందని రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రేడ్–1 వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం ఏడో రోజు కొనసాగింది. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే పుస్తక పఠనం , కథలు, కోపల్లె శ్రీనివాస్‌చే విద్యార్థులకు అక్షరాస్యత, విజ్ఞానం, గౌరవ మర్యాదలపై అవగాహన కల్పించారు. వి.జనార్థనరావుచే దేశభక్తి, ప్రబోధాత్మక గేయాలు నేర్పించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని అప్పుడే విజ్ఞానం సొంతమవుతుందని చెప్పారు. మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన మ్యాజిక్ షో

తణుకు అర్బన్: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా తణుకు శ్రీరామకృష్ణ సేవా సమితి, సజ్జాపురంలోని వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మోటివేషన్ మ్యాజిక్ షో విద్యార్థులను అలరించింది. ప్రముఖ సైంటిఫిక్ మెజీషియన్, సైకాలజిస్ట్, మోటివేషనల్ ట్రైనర్ బీఎం గోపాలరెడ్డి (గోపీ మామ) మోటివేషనల్ మ్యాజిక్ చిన్నారుల్లో జోష్ నింపింది. ప్రస్తుత రోజుల్లో మారుతున్న అలవాట్లు, సెల్‌ఫోన్, టివి చూడడం వలన కలిగే నష్టాలు, మైండ్ పవర్, సాధించలేనిది ఏదీ లేదు, ఓజోన్ పరిరక్షణ, దేశభక్తి, ఐకమత్యం, పెద్దలను గౌరవించడం వంటి అంశాలను మ్యాజిక్ ట్రిక్స్ ద్వారా వివరించిన తీరు ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం కరాటే రామకృష్ణచే చిన్నారులకు కరాటే, డ్రాయింగ్ నేరి్పంచారు. సమితి కార్యదర్శి చిలుకూరి రామకృష్ణ, కోఆర్డినేటర్స్ గిరీశ్వరరావు, అక్కింశెట్టి రాంబాబు, రిసోర్స్ పర్సన్స్ మహేష్, ఇందిర, తారకాపురి రాజేంద్ర, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

కోకోనట్ మర్చంట్స్ అధ్యక్షుడిగా కఠారి



కఠారి నాగేంద్ర కుమార్‌ను అభినందిస్తున్న సంఘ సభ్యులు

యలమంచిలి: ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పంట తరువాత అధిక పంట కొబ్బరి పంటే అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొబ్బరి పంట విశిష్టతను తెలిపారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కఠారి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో సంఘ సభ్యులు గెలిపించారని వారి నమ్మకాన్ని నిలబెట్టాలా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శిగా మాటూరి రామ్‌కుమార్, కోశాధికారిగా దేవరపు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా మాటూరి వీర వెంకట నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా చివటపు నాగేశ్వరరావు, కుందురు వెంకట్రామయ్య, లంకలపల్లి సత్య రమేష్, సహాయ కార్యదర్శిగా కొండేటి శ్రీనివాస్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహరావు, ఉపాధ్యక్షులు దేవరపు లక్ష్మీనారాయణ, గవర సూర్యనారాయణ, కొల్లి నరసింహమూర్తి, కొండేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పసలదీవి దుర్గమ్మ జాతర ప్రారంభం

నరసాపురం రూరల్: మండలంలోని పసలదీవి గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రధాన రహదారిలోని దుర్గమ్మ, మారమ్మ, అమ్మవార్ల ఆలయాల నుంచి చలిమిడి పానకాలను తీసుకువెళ్లారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సోమవారం మధ్యాహ్నం 1 గంటకు అమ్మవారి నిప్పుల గుండాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం తీన్‌మార్, డప్పుల నృత్యం, బుట్టబొమ్మలతో జాతర మహోత్సవం ఉంటుందన్నారు.

వైభవంగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పట్టణంలో కోవెలగా సుపరిచితమైన శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పుష్కరిణిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంసవాహన తెప్పపై శ్రీ ఆదికేశవస్వామి, మణ్వాల మహాముని, రామానుజాచార్యుల ఉత్సవ విగ్రహాలను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ, జై రామానుజ అంటూ నినాదాలతో ఆ ప్రాంగణమంతా మారుమోగింది. ఉత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధనను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

వేద పరీక్షలు ప్రారంభం



పరీక్షల్లో పాల్గొన్న వేద విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శంకర మఠంలో వేంచేసియున్న శ్రీఉమా చంద్రమౌళీశ్వర స్వామి, శ్రీసర్వ మంగళమ్మ దేవస్థానంలో వేద పరీక్షలు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 400 మంది వేద విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. పరీక్షాధికారులుగా గుళ్లపల్లి హర్ష, ఉపాధ్యాయులు బాబ్జీలు విద్యార్థులను పరీక్షించారు. ఉదయం విద్యారణ్య స్వామి వారిచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు అన్నప్రసాదాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించినట్లు పోలీసులు తెలిపారు. విస్సాకోడేరు గ్రామంలోని టెంపుల్ సెంటర్ వద్ద రాత్రి ఏడు గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో కె.శ్రీనివాసరావు మృతి చెందాడని, అతడికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, స్వగ్రామం వంకాయలపాలెమని, ఆకు కూరలు అమ్ముతుంటాడని తెలిసింది. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి మంచినీటి సరఫరా తదితర అత్యవసర అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యక్తిత్వంతో కూడిన విద్యను అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైకాలజిస్ట్ రామకృష్ణ

తణుకు అర్బన్: విద్యతో పాటు క్రీడలు, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించే విద్యాభ్యాసాన్ని తల్లితండ్రులు తమ పిల్లలకు అందించాలని ప్రముఖ సైకాలజిస్ట్ యనమండ్ర జయవెంకట రామకృష్ణ అన్నారు. తణుకులో నూతనంగా ప్రారంభించిన ప్రగతి విద్యాలయలో ఆదివారం నిర్వహించిన తల్లితండ్రుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో ధృడంగా నిలబడేతత్వాన్ని విద్యార్థులు విద్యాభ్యాసంలోనే అందిపుచ్చుకునే విధంగా రాటుదేలాలని సూచించారు. మంచి మార్కులు వచ్చిన విద్యార్థి మంచి వ్యక్తులు కాలేరని, పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్యతోనే మంచి విద్యార్థిగా ఎదుగుతారని స్పష్టం చేశారు. ప్రగతి విద్యాలయ డైరెక్టర్ ప్రగతి రాజా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసంలో వెనుకబడిపోతున్నారన్నారు. ప్రతి విద్యార్థిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలనే తపన ప్రగతి విద్యాలయ సంస్థ సంకల్పం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సత్కారం అందుకుంటున్న జిల్లా మేదరి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా మేదరి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక, సర్వసభ్య సమావేశం ఆదివారం తణుకు షాదీఖానాలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మేదరి మహేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారి కొండా భాను శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆకివీడుకు చెందిన సందా కేశవరావు, ప్రధాన కార్యదర్శిగా తణుకుకు చెందిన ధూళిపాళ్ల ముసలయ్య, కోశాధికారిగా భీమవరానికి చెందిన కొండా ఉదయ బాలాజీ, ప్రచార కార్యదర్శిగా అత్తిలికి చెందిన కాపెల్లి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం మేదరి సంక్షేమ సంఘం నూతనకార్యవర్గాన్ని తణుకు మేదరి సంఘం ఘనంగా సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి మేదరి సంఘ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో తణుకు మేదరి సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, జోరిగే చిన్న, అత్తిలి సంఘ అధ్యక్షుడు కొండా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ ఎన్నికల్లో లోకల్ అభ్యర్థికే పట్టం

యలమంచిలి: క్షీరపురి ఆర్యవైశ్యులు లోకల్ అభ్యర్థికే పట్టం కట్టారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో లోకల్, నాన్ లోకల్ అంటూ వాడీవేడిగా సాగిన ఆర్య వైశ్యుల సంఘం అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. లోకల్ అభ్యర్థి అయిన రేపాక ప్రవీణ్ భాను 405 ఓట్ల మెజారిటీతో ఈ ఎన్నికల్లో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు నాళం బాపిరాజు, కారుమూరి శ్రీరాములు ప్రకటించారు. పోటీ అయిపోయిందని, సంఘస్తులను కలుపుకొని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.